# పాన పిశాచి! ★

రచన:
ము. కృష్ణమూర్తి పట్నాయక్

['.....ఇల్లువల్లూ కూలద్రోసే కల్లుమానండోయ్...' అనే 'గృహలక్ష్మి' చిత్రంలోని రాజగీతం మారుమ్రోగుతునేయుంది. మహాత్మాజీ ఎంతో వారించాడు. ప్రసంచలనందిన కాంగ్రెస్ ప్రభుత్వం మద్యపాననిషేధాన్ని కొంతవరకుచేసి పుణ్యం కట్టుకునేయుంది. అన్నిటికన్నా మిన్నయైన మహోదయం—భారతావని స్వాతంత్ర్యం—సంప్రాప్తమవనే అయింది. స్వాంతంగానే, కడగండ్లుపడ్డారు; చూశారు; పడుతూన్నారు; చూస్తూన్నారు. ఇంతజరిగినా; పానపిశాచి వదలలేదు! దానిచే ఆహుతి అవడం ఆగలేదు! ఇకనైనా మేల్కొనాలి పానపిశాచిని పూర్తిగ పారద్రోలాలి, ఇక చదవండి.

—సంపాదకుడు.

"ఏమేయ్!" బ్రద్దలయ్యేటట్టు తలుపును కొట్టుతూ పిలిచాడతడు.

ఎవ్వరూ పలకలేదు. తలుపు తెఱవబడలేదు.

'ఒసేయ్....ఒసేయ్....' రెట్టించిన ధ్వని చేసాడు.

ఫలితం కలగలేదు. తలుపు తెఱవబడేసూచన కనబడలేదు.

'ఒసేయ్ దెయ్యమా...!' భీకరంగాఅన్నాడు.

లోన బాధతో కూడిన ఒకమూలుగు వినబడ్డది. కొంతసేపటికి తలుపు తెఱువబడింది. తెఱవబడే తెఱవబడడంతో లోనికి లంఘించి జుత్తుపట్టుకున్నాడు ఆమెది—భార్యది.

'ఏంచేస్తున్నావే లమిడీ, తలుపుతీయవా?' ఉగ్రరూపంతో అంటూ నాలుగు గుద్దులు గుద్దాడామెను.

అదివఱకే సగంప్రాణంతో నున్న ఆమె, పూర్తిగ ప్రాణంపోయిందేమోనన్నట్టు నేలపై ఒరిగిపోయింది.

'చావుముండా, చావు!' అని, ఇంట్లో నాలుగువైపులా చూచాడు.

ఒకమూల, చింకిచాపమీద ఎముకలపోగైన పసిబిడ్డడు చచ్చినట్టు పడున్నాడు. ఇంకొకమూల, వెన్నుకు అంటిన కడుపును చేత్తో పట్టుకొని గింజుకుంటూ, కళ్లుమూని కింద దొర్లుతోంది పదేళ్ళఅమ్మాయి. ఆమెదగ్గరే యకృత్ ప్లీహారోగంతో వికృతాకారిణియై సొమ్మసిల్లి వెల్లకిలాపడుంది ఆరేళ్లబాలిక. మరోమూల, నేలమీద కాళ్ళుముడుచుకొని ఒకచేతిని క్రిందనుంచి దానిపై తలనుఆన్చి, రెండోచేతిని పొట్టలోపెట్టుకొని స్పృహతప్పి కదలనికూర్మంలా వున్నాడు ఎనిమిదేళ్ళ అబ్బాయి. ఇంకొకమూల, చిరిగినబుట్టలు, విరిగిన కుండలు, శూన్యంతో తల్లక్రిందులైయున్నాయి, పొయిబుగ్గయివాలేనిపొయ్యి, ప్రేతభూమికన్న కనికష్టంగా వుంది. ఇల్లంతా వెలవెలబోతూ, పెద్దమ్మ గలగలమనే ఇనుపగజ్జలలోని విలయతాండవానికి వివశమొందినట్లుంది.

'ఊఁ' అని చటుక్కున మొఖాన్ని అటునుండి యిటు తిప్పేసి భార్యపైని దృష్టినిబరిపాడు, చైతన్యంలేక అలానే పడుందామె.

'ఎందుకా టక్కులే!' గర్జించాడు.

జవాబు రాలేదు.

'లెగూ' ఉరిమాడు.

ఫలితం కలగలేదు.

'ఓహో!' అరిచి రెక్కపట్టి ఎత్తి కూర్చోబెట్టాడు. 'అన్నా!' అని ఒరిగిపోతూనే ఆదుకొని కూర్చుందామె ఎలాగో.

'ఏమైనా డబ్బులు...?'

'డబ్బులా! అయ్యో మీకు తెలీనిదేముంది!'

'నాకు తెలీనిదిలేదు. అంచేతే యియ్యి! ఒక్కచుక్కైనా పడలేదు.'

'వారంరోజులనుండి పస్తు. పిల్లలు మృత్యుముఖంలోనున్నారు — ఒక్కదమ్మిడైనా వుంటే గంజయినా కొనుక్కొని తెచ్చియుందును.'

'నీలాటి పెద్దమ్మకు అది రావడమెలా ?' అని వెక్కిరించి, ఆమెను ఒకతాపు తన్ని—'మెడలోని సూత్రం...' తీవ్రంగా చూచాడు.

భయంతో మంగళసూత్రాన్ని పట్టుకుందామె. ఎండిన నూతులైన కళ్ళనుండి ఎలాగో మళ్ళా నీరు కారసాగింది.

'ఇలా యియ్యి అది.'

'...............'

'ఇయ్యవా ?'

'...............'

మాట రాక జవాబియ్యలేకపోయిందామె. మహాకోపంతో నిర్దాక్షిణ్యంగా బలంకొలది విదలించి ఆమె మెడలోని పవిత్రమైన మంగళసూత్రాన్ని తెంపి పట్టుకొని పారిపోయాడు. 'అయ్యో!' అంటూ నెత్తికొట్టుకుందామె.

వస్తువాహనాలు మొదలగు సకల సంపత్తులు త్రాగుడుచేపోయి చివరకు అపవిత్రమైనదీ, పోయింది. అది అసలు ఆదినేపోయినా, అపర అనసూయయైన ఆమె అమ్మగారి సహాయంతో మరలా చేయించుకుంది. మొదట ఆరుతులాలసువర్ణంతో చేయబడిన అది—, నేడు, ఆరుకాసుల ఎత్తైనా లేదు! నేడు అదియైనా లేకపోయింది!

దౌడుతీస్తూ తిన్నగ బంగారుశెట్టి దగ్గఱకు వెళ్లాడతడు. కళ్ళజోళ్ళ అద్దాలగుండా పదే పదే అతనిచ్చిన నగయొక్క నాణ్యాన్నిచూస్తూ, తూకం చేసి, స్వచ్ఛమగు స్వర్ణమైనా, అస్వచ్ఛమైనదని అబద్ధమాడి, తూకంలో తక్కువని మోసగించి, పూర్ణమైన విలువనీయక అర్ధవెలను అందించాడా కోమటి. ఏది ఎలాగున్నా తాగడానికి తగినసొమ్ము చేజిక్కినందుకు అపరిమితానందమంది అదే పదివేలనుకొని పానశాలకు పయనమైనాడు పానప్రియుడు. పైసా ఎదుటపెట్టగానే పానసీసాలు ప్రత్యక్షమైనాయి. శాలవాడు అందిస్తూంటే 'గుటగుట' మంటూ తాగుతూ ఒక్కొక్కబుడ్డీ, ఖాళీచేయసాగాడు. కడుపునపట్టినంతకాక అధికపైకం దగ్గఱున్నందున మితిమీఱి తాగేశాడు. తాగమరి శక్తిలేకపోగా మిగిలింది పారబోసి తూలుతూ అక్కడనుండి లేచాడు. కొంతదూరం వచ్చాడోలేదో చైతన్యహీనుడయ్యాడు. కాళ్లు ముందుకుపోవు. శరీరం నిలవదు. తల తిరిగిపోయింది. దబ్బున నేలమీద పడిపోయాడు. ఇక ప్రపంచంతో సంబంధం లేకపోయాడు రెండు గంటలు దొర్లినై. రవంతైనా మత్తువదలలేదు.

కారుచీకట్లు కమ్ముకున్నై. నిశ్శబ్దం అలముకుంది. నిశాచరాలు సంచరించాయి. దూరాన నక్కలు అరువసాగాయి. కీచురాళ్లు పాడసాగాయి. మిణుగురు పురుగులు మెరుస్తూ తిరుగసాగాయి. గ్రుడ్లగూబలు కూయసాగాయి. ఆ భయంకర వాతావరణం, పవనం తాకిడిచే పొడుగై, దట్టమై పెరిగిన చెట్లు, భూతాల్లా తలలాడిస్తూంటే మరీ భయమిళితమైంది. అయినా అతడికిమాత్రమిదంతా అగోచరమే!

అంతలో 'గుఫ్ గుఫ్' మనే ధ్వని వినిపించసాగింది. తూర్పున సూర్యుడు ఉదయించేలా ఒక గోళాకారదీపకాంతి కనబడసాగింది. క్రమేణా శబ్దం, వెలుతురూ రెట్టింపయింది. కాని, ఆ పెనుధ్వని, చెవిటిముందు శంఖానినాదమే అయింది అతడి యెదుట! అక్కడనుండి లేవనేలేదు!

'సరే, అయితే ఇక నాదేమీ దోషంలేదు సుమా! అన్నట్లు నిప్పులుగ్రక్కుతూ కోపంతో గబగబా దాటివెళ్ళిపోయింది. అతనిమీదినుండిఆకాశమంతటి మెయిలు ఇంజను!

దానితో వికావికలై నలుదిశలా ఎగిరిపోయింది అతడి శరీరం!

పానపిశాచిచే కన్నుగానక అడ్డదారిగుండానున్న రైలుత్రోవపైపడి లేవనందున ఆ రైలే లేపించివేసింది!!

ఈ పానపిశాచివల్ల ఎందఱు నాశమై పోతున్నారో!!! ఇకనైనా మేలుకోరాదా ?